

'దోస్త్' హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం



దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): దోస్త్ జిల్లా సహాయ కేంద్రాన్ని సిద్దిపేట డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సునిత ప్రారంభించారు. డిగ్రీ కోర్సులలో అడ్మిషన్స్ పొందడానికి మే 3న దోస్తు నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దోస్త్ అడ్మిషన్ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కళాశాలలోని జిల్లా సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని తెలియజేశారు. దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాస్కర్ మాట్లాడారు. విద్యార్థులు రూ.225 చెల్లించి ఈనెల 21 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని, మే 10 నుంచి మే 22 వరకు వెబ్‌ఆప్షన్లు సెలక్ట్ చేసుకోవాలన్నారు. ఈ నెల 29న మొదటి విడతలో కేటాయించిన సీట్లను విడుదల చేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అయోధ్య రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ పిట్ల దాసు, డాక్టర్ శ్రద్ధానందం. సూపరింటెండెంట్ శ్రీనివాస్ దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ ఎస్ మహేష్ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవన్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 60 సీట్లు, బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో 60 సీట్లు, బీకాంలో 60 సీట్లు, బీఏలో 60 సీట్లు వీటితో పాటు అప్రెంటిస్ ఆధారిత కోర్సులైన బీకాం రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ అందుబాటులోకి రానున్నాయ ని, అడ్మిషన్ పొందాలనుకునే వారు దోస్త్ ద్వారా అప్లయ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కళాశాల అడ్మిషన్ల విభాగం బాధ్యులు కిషోర్ 9441136224, డాక్టర్ శ్యాము 9440571832 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని చెప్పారు.

ఊగిసలాట

అయోమయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు

- పెరిగిన నిర్మాణ వ్యయం
- నిరుపేదలకు ఆర్థిక భారం
- గుడిసె వాసుల నిరాసక్తత
- కట్టుకుందామనుకున్న వారికి నిబంధనలు అడ్డు
- 600 చదరపు అడుగులలోపు అంటే ససేమిరా..!
- జిల్లాలో ప్రారంభమైన ఇళ్ల నిర్మాణాలు 655 మాత్రమే



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన రామేశ్వరంపల్లిలోని ఓ పూరి గుడిసె

"ఇల్లు కట్టుకునేందుకు ముగ్గు పోసి పునాది తీయాలంటే చేతిలో డబ్బులు ఉండాలే.. ఇప్పటి పరిస్థితిలో నయాపైసా అప్పుపుట్టడంలేదు. ఇంక ఇల్లు ఎలా కట్టుకోవాలో అర్థం కావడం లేదు" అంటూ అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లికి చెందిన పల్లె రేణుక వాపోయింది.

"ఇంటి నిర్మాణానికి పెట్టుబడి భారం పెరిగింది. సిమెంట్, ఇనుము, ఇసుక ధరలు పెరిగాయి. చేతిలో డబ్బులు లేకుండా సర్కారు ఇచ్చే పైసలపై ఆశతో ఇల్లు మొదలు పెడితే ఇబ్బందుల్లో పడాల్సి వస్తుందని భయమవుతుందని" అదే గ్రామానికి చెందిన పద్మ ఆందోళన వ్యక్తం చేసింది.

దుబ్బాక, మే6 (ఆంధ్రజ్యోతి) : ఇలా ఒకరో ఇద్దరో కాదో మొదటివిడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా సిద్దిపేట జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన 26 గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వం జిల్లాకు 2,667 ఇళ్లను మంజూరు చేసింది. ఈ పథకం ప్రారంభమై మూడునెలలు గడిచినా ఇప్పటి వరకు కేవలం 655 మంది మాత్రమే నిర్మాణం చేపట్టడానికి ముందుకు వచ్చారు. రెండోవిడత సాగుతున్న సర్వేలో నియోజకవర్గానికి సుమారు 3,500 ఇళ్లకు అర్హులను గుర్తించే పనిని గ్రామకార్యదర్శులకు అప్పగించారు. ఎంపీడీవో, ఎంపీవోలు, ఏఈలు, ఏవో, మండల గెజిటెడ్ అధికారులతో గ్రామాల్లో సర్వే చేస్తూ లబ్ధిదారుల వద్దకు వెళ్తే ఇళ్లు కట్టుకోవడానికి నిరాసక్తతను వెలిబుచ్చినట్లు సమాచారం. ఇందుకు ప్రధాన సమస్యగా ప్రభు త్వం విధించిన నిబంధనలతో పాటు ఆర్థిక పరిస్థితులు, పెరిగిన నిర్మాణ భారంతో చాలాచోట్ల ముందుకు రావడం లేదు. గ్రామాల్లో కార్యదర్శులు, గృహనిర్మాణశాఖ అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, ఆర్థిక అంశాలతో ముడిపడటంతో వెనుతిరుగుతున్నారు.

నిబంధనలే అడ్డు

గత ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినా అసలైన లబ్ధిదారులకు అందించలేదనే విమర్శలు లేకపోలేదు. ఇక ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారులకే స్వేచ్ఛను ఇస్తారని , ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చిన నిబంధనలే ఉంటాయని లబ్ధిదారులు ఆశించారు. చాలా గ్రామాల్లో ముందస్తుగా పునాదులు తీసుకున్నారు. తీరా పునాదులు తీసుకున్న వారికి, 600 చదరపు గజాల(66.67గజాలు) లోనే నిర్మించుకోవాలని ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో ఆయా గ్రామాల్లో పునాదులు తీసుకున్న వారు, విశాలంగా నిర్మించుకోవాలనుకున్న వారి ఆశలు అడియాశలయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దూరంగా ఉఉంటూ, నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు.

పునాది తీస్తేనే డబ్బులు

ఉమ్మడి రాష్ట్రంలో ముందస్తుగా సిమెంటు, బెసిమెంట్ డబ్బులను అందించి నిర్మాణం ప్రారంభించేవారు. అంచల వారీగా నిర్మాణం చేపట్టిన ప్రకారం ప్రభుత్వం బిల్లులను అందించేది. ఉన్నంతలో తమకు అవసరమైన విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టేవారు. ప్రస్తుతం పునాది తీసుకుంటేనే బిల్లులు మంజూరీ చేస్తామనే నిబంధన లబ్ధిదారులను ముందుకు రానివ్వడం లేదు. పునాది నిర్మాణం చేపట్టాలంటే సుమారు రూ.1.50లక్షలు ముందస్తుగా వెచ్చించాల్సి ఉంటుంది. గుడిసెలో నివాసం ఉండే వారికి తిండికే కష్టంగా ఉంటే, ఇళ్ల ఎలా నిర్మించుకోవాలని ప్రశ్నిస్తున్నారు.

రుణ సదుపాయం కల్పించాలి

జిల్లాలో సుమారు 82వేల మంది పైచిలుకు నిరాశ్రయులు ఉన్నట్టుగా ప్రభుత్వం గుర్తించింది. అందులో నియోజకవర్గానికి 3,500 చొప్పున, రెండోవిడత కలిపి మొత్తం 11వేల పైచిలుకు ఇళ్లను మంజూరు చేశారు. అయితే ప్రధానంగా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు అర్థం కాకపోవడం వల్ల చాలాచోట్ల నిర్మాణం చేపట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం అందించే నిధులు ఏ రూపంలో అందిస్తుందో కూడా పూర్తిస్థాయి స్పష్టత కూడా లేదు. నిర్మాణ వ్యయం పెరిగితే తాము అదనంగా వెచ్చించాల్సిన డబ్బును బ్యాంకు ద్వారా రుణం అందిస్తే, తాము నెలసరి వాయిదాల ప్రకారం చెల్లించే వెసులుబాటు ఉంటే బాగుండనే వాదనలు కూడా ప్రజల్లో ఉన్నాయి.



రామేశ్వరంపల్లిలో గుడిసెలోనే జీవిస్తున్న మహిళ

పెరిగిన నిర్మాణ భారం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు మూడు సార్లు సిమెంటు ధరలు పెరిగాయి. మూడు నెలల క్రితం 310 వరకు ఉన్న గ్రేడ్‌వన్ సిమెంటు ధర ప్రస్తుతం 380కు పెరిగింది. మరో రెండు రోజుల్లో 400 వరకు పెరిగే అవకాశం లేకపోలేదు. గ్రేట్ టూ సిమెంటు 260 నుంచి అమాంతంగా 330 వరకు పెరిగింది. స్టీల్ ధర కూడా అమాంతంగా పెరిగింది. మూడు నెలల క్రితం టన్ను (వెయ్యికిలోలు)రూ.53 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.58 వేలకు పెరిగింది. ఇటుక ధరలు కూడా రెట్టింపయ్యాయి. కంకర టన్ను రూ.750 ఉండేది, ప్రస్తుతం 900 పెరిగింది. టన్ను ఇసుక రూ.900 నుంచి రూ.1800 పెరిగింది. బ్లాక్‌లో రూ.2వేలు పెట్టినా లభించడం లేదు. వీటిని బట్టి ఇంటి నిర్మాణానికి గజానికి సుమారు రూ.17వేల నుంచి రూ.18వేలు ఖర్చవుతుంది. ఇళ్లు పూర్తిస్తే 66.67 గజాలకు సుమారు రూ.11,66,650 ఖర్చవుతుంది. ప్రస్తుత పరిస్థితిలో తక్కువగా 400 చదరపు అడుగుల వరకు నిర్మించుకున్నా కూడా సుమారు రూ.8లక్షల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఇది కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చును.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దుబ్బాక, మే 6 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చలేక కుటుంబపోషణ భారమై రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి వార్డు లో మంగళవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుంపలపల్లి వార్డుకు చెందిన రవీందర్‌రెడ్డి(36) తనకున్న భూమిలో 4 బోర్లను వేశాడు. బోర్లు వేయడానికి, సాగుకోసం మొత్తం రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. అవి తీర్చేమార్గం లేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడరు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. మృతదేహాన్ని దుబ్బాక ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రమ్యకృష్ణ, ఇద్దరు పిల్లలున్నారు.

చేర్యాల చేపల మార్కెట్‌ను

పట్టించుకోరా?

- వారాంతపు సంతలో రోడ్డుపైనే విక్రయాలు
- గతంలో పెద్దచెరువుకట్ట ఆవరణలో రూ.10లక్షలతో షెడ్డు నిర్మాణం
- మౌలిక వసతులను కల్పించకపోవడంతో నిరుపయోగం

8

జవాబుదారీతనం పెరగాలి

- సీనియర్ సంపాదకులు, కవి, రచయిత కె. శ్రీనివాస్
- మీడియా అంటే తెలియనివారిని జర్నలిస్టులుగా గుర్తించవద్దు
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీ పిలుపు

7

పోస్టాఫీస్‌లో

ఆధార్ సేవలు

- సద్వినియోగం చేసుకోవాలి : పోస్టల్ అధికారులు
- మార్పులకు వచ్చే వారు సంబంధిత పత్రాలు తప్పనిసరి

7



నష్టం వివరాలు అందజేస్తాం

- కలెక్టర్ మనుచౌదరి

కొండపాక, మే 6 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కొండపాక మండలం వెలికట్టలో దెబ్బతిన్న పంటలను, విశ్వనాథపల్లి రవీంద్రనగర్ లో కాయలు రాలిపోయిన మామిడి తోటలను రెవెన్యూ, ఉద్యానవన వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు వ్యవసాయ క్షేత్రాల్లో దెబ్బతిన్న పంటలను గుర్తించి వివరాలను అందించాలని ఆదేశించారు. నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపించి ప్రభుత్వం నుంచి త్వరగా నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు వివరించారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, కొండపాక తహసిల్దార్ దిలీప్ కుమార్, వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్, మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి తదితరులు ఉన్నారు.



వెలికట్టలో వర్షానికి దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

హోంగార్డ్స్ పోలీసుశాఖలో అంతర్గత భాగం

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మే6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డులు పోలీస్‌శాఖలో అంతర్గత భాగం సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జిల్లాలో ఉన్న హోంగార్డు సిబ్బందితో క్షేత్రస్థాయిలో దర్బార్ నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడారు. యూనిఫాం వేసుకున్న ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ చాలా ముఖ్యమని, యూనిఫాంలో ఉన్న వారిని పది మంది గమనిస్తూ ఉంటారని అది తెలుసుకుని విధులు నిర్వహించాలని సూచించారు. చిన్నచిన్న పొరపాట్లతో జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. వ్యక్తిగతంగా, డిపార్ట్‌మెంట్‌పరంగా క్రమశిక్షణ చాలా ముఖ్యమని, ఎవరు కూడా విధులకు చెప్పకుండా గైర్హాజర్ కావద్దని సూచించారు. ఒకరికి ఒకరు మర్యాద ఇచ్చి పుచ్చుకోవాలని ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రతిరోజూ వాకింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, యోగా, మెడిటేషన్ ఏదో ఒకటి తప్పకుండా చేయాలని సూచించారు. అందరూ క్రమశిక్షణతో పనిచేయాలని చెప్పారు. పోలీస్‌శాఖలో పనిచేస్తూ నిబంధనలు అతిక్రమిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బం దులను వివరించారు. క్రమశిక్షణ తప్పితే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్ర బోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్, కార్తీక్, విష్ణుప్రసాద్ ఆర్ఎస్ఐలు బాలకృష్ణ, రంజిత్, సాయి చరణ్, హోంగార్డు అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

ఆగని ప్రకృతి విధ్వంసం

- మాయమవుతున్న బైరాన్‌చెరువు గుట్టలు
- రోజు వందలాది టిప్పర్ల మట్టి తరలింపు..
- హన్మకొండ జిల్లాలోని నేషనల్ హైవే పనులకు తరలింపు
- వన్య ప్రాణుల మనుగడకు ప్రశ్నార్థకం..



హుస్నాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న బైరాన్‌చెరువు ప్రాంతంలో ప్రకృతి విధ్వంసం కొనసాగుతూనే ఉంది. నెల కాదు, రెండు నెలలు కాదు ఏడాది అంతా అక్కడి గుట్టలను (ఏనే) కొల్లగొడుతూనే ఉన్నారు. ఒక వైపు గుట్టలు.. మరో వైపు మామిడి తోరణంలా ఉండే ప్రకృతి పేర్చిన ఏనే.. మధ్యలో చెరువు.. మనసుకు ఆహ్లాదమనిపించే పచ్చిక బయళ్లు.. వన్యప్రాణులకు ఆవాసమైన ప్రాంతం. కానీ ప్రస్తుతం ఆ అందాలు మాయమవుతున్నాయి. రోజు ఈ గుట్టల నుంచి వందలాది టిప్పర్ల మట్టి తరలిపోతుండటంతో ఆ ప్రకృతి అందాలు కనుమరుగవుతున్నాయి. ఈ ఏనే నుంచి మట్టి తీసుకునేందుకు అధికారులు అనుమతులు ఇచ్చినా ఇక్కడ ఉండే వృక్ష సంపద, వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. ప్రస్తుతం అక్కడి ఏనే నుంచి హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి, ఎల్లాపూర్ వద్ద జరిగే నేషనల్ హైవే పనులకు ప్రతి రోజు వందల టిప్పర్ల మట్టిని తరలిస్తున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లడానికి కనీస రహదారి లేకపోవడంతో కాంట్రాక్టర్లు ప్రత్యేకంగా రోడ్డు వేసుకుని మరీ తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి మట్టిని తరలిస్తుండటంతో ఆ బైరాన్ చెరువు ప్రాంతంలోని ఏనే తన ఆకృతిని కోల్పోయింది. బైరాన్ చెరువు దిగువన మహాసముద్రం గండి (రిజర్వాయర్) ఉంటుంది. దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దెందుకు నిధులు కూడా మంజూరయ్యాయి. బైరాన్‌చెరువు, మహాసముద్రం గండి పక్కపక్కనే ఉండటంతో ఈ ప్రాంతమంతా పర్యటకంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సందర్భంలో ప్రకృతి పేర్చిన ఈ ఏనేను విధ్వంసం చేస్తుండటంతో ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఏనే నుంచి మట్టిని తీసి చదును చేసిన భూమి

ఎంతో చరిత్ర కలిగిన ఏనే..

హుస్నాబాద్ పట్టణానికి దక్షిణ భాగాన ఈ ఏనే (గుట్ట) ఉంది. మండలంలోని కూచనపల్లి నుంచి పోతారం (ఎస్), బైరాన్‌చెరువు వరకు దాదాపు 8 కిలోమీటర్ల మేర ఇది పరుచుకుని ఉంది. హుస్నాబాద్ చెరువు వద్ద ఎల్లమ్మ ఏనేగా, పోతారం గ్రామం (ఎస్) వద్ద వడ్లోని ఏనేగా పేరుందింది. పోతారం(ఎస్) వద్ద ఇది దక్షిణం నుంచి ఉత్తరం వైపుగా మారి మహాసముద్రం గండి వరకు కొనసాగింపుగా ఉంటుంది. కాకతీయుల కాలంలో దీనినే కట్టగా చేసుకుని ఎల్లమ్మ చెరువు నిర్మించారని చెబుతారు. హుస్నాబాద్‌కు 12 కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రస్తుత అక్కన్నపేట మండలం కట్కూర్ వరకు హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ఉండేదని, ఈ చెరువులో అక్కడ చేపలు పట్టేవారు. ఈ గుట్టపై నుంచి చూస్తే హుస్నాబాద్ పట్టణం ఎంతో అందంగా కనిపిస్తుంది. ఈ ఏనే నుంచి కూడా మట్టిని తరలించడంతో తన ఆనవాలు కోల్పోయింది.



బైరాన్ చెరువు ఏనే నుంచి మట్టిని తీస్తున్న యంత్రాలు

అనుమతులను రద్దు చేయాలి..

సహజమైన ప్రకృతి సంపద కలిగిన బైరాన్‌చెరవు వద్ద ఏనే నుంచి మట్టిని తరలించేందుకు కాంట్రాక్టర్లకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. హన్మకొండ జిల్లా పరిధిలో మట్టి ఉన్న ఎన్నో గుట్టలను విడిచి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇక్కడి ప్రకృతి ధ్వంసం చేస్తుండటం సరికాదని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో పాటు. బైరాన్‌చెరువులో నీరు ఉంటే హుస్నాబాద్ పట్టణంలో మంచినీటి సమస్య ఉండదని, ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులతో చెరువు మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని, మట్టి తరలింపుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని అధికారులను కోరుతున్నారు.

ముదిరిన ఎండలు.. మూగజీవాలకు తిప్పలు

● వేసవి తాపానికి అల్లాడుతున్న పశువులు



ఎండ వేడిని తట్టుకోలేక మురుగు నీటిలో, పొదల చాటున నిల్చున్న పశువులు

కోహీర్, మే 6(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు చల్లదనం కోసం కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు. మరి జనాల పరిస్థితి ఇలా ఉంటే నోరు లేని మూగజీవాల పరిస్థితి దయనీయంగా మారింది. ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. గాలి ప్రసరణ సరిగా లేకపోవడం షెడ్లలో ఎక్కువ సంఖ్యలో పశువులు ఉండడం నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం వంటి కారణంగా వడదెబ్బకు గురవుతున్నాయి.

ముందస్తు చర్యలతో రక్షణ

పెరుగుతున్న వేసవి తాపానికి పశువులు గొర్రెలు కోళ్లు కకల వికలమవుతున్నాయి. ఏప్రిల్ 20 నుంచి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే పైనే నమోదు కావడంతో పలు గ్రామాల్లోని పశువులు కోళ్లు గొర్రెలు వడదెబ్బకు గురవుతున్నాయి. వేసవిలో రోజు వారి మేత అందించే సమయాన్ని మార్చుకోవాలి. ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు మేతకు వదలాలి. శరీరంపై ఉండే వెంట్రుకలను కట్ చేస్తుండాలి. వేసవిలో సరైన నీరు ఆహారం ఇవ్వని పక్షంలో పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. పశువుల పాకలను శుభ్రంగా ఉంచాలి. కొట్టాలపై, కోళ్ల షెడ్లపై గోనే సంచులను ఏర్పాటు చేయాలి.

పశువులకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో పశువులను పగటిపూట మేతకు బయటకు వదలకూడదు. తాగు నీరు అన్నివేళల్లో అందుబాటులో ఉంచాలి. పశువులను రోజుకు రెండుసార్లు చల్లని నీళ్లతో కడగాలి. వెళ్తురు ప్రసారమయ్యేలా ఎత్తయిన కొటాన్ని గడ్డితో నిర్మించాలి. లేదా రేకులు ఉంటే పైన వరిగడ్డి పరచాలి. ఉప్పు కలిపిన కుడితిని అందించాలి పచ్చని పశుగ్రాసం అందుబాటులో ఉంచాలి. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే చోటుకు చేర్చాలి. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంజక్షన్లు వేయించాలి. సంచార పశువైద్యశాల 1922 సేవలు వినియోగించుకోవాలి.

వసంతకుమారి (జిల్లా పశువైద్యాధికారి), సంగారెడ్డి

10వ తరగతి పాసైన సంబరం మిగల్చకుండానే.. అనంతలోకాలకు



ఉల్లెంగుల శివాజీ (ఫైల్)

హుస్నాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆరు రోజుల క్రితం విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాసైన తమ కుమారుడిని చూసి తబ్బిబ్బయ్యారు. తమ కుమారుడు పాస య్యాడని చుట్టాలకు, పక్కాలకు చెప్పుకుంటూ సంబరపడి పోయారు. కానీ ఆ సంతోషం కొద్ది రోజులు కూడా మిగల్చకుండానే తమ ఒక్కగానొక్క కుమారుడిని మృత్యువు కరెంట్ రూపంలో కానరానిలోకాలకు తీసుకెళ్లి ఆ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చింది. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి హనుమాన్ నగర్‌లో జరిగింది. హనుమాన్ నగర్‌కు చెందిన ఉల్లెంగుల కొమరయ్య, స్వరూపల కుమారుడు ఉల్లెంగుల శివాజీ (15) పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. సోమవారం రాత్రి కురిసిన , వర్షానికి, గాలులకి కొమరయ్య ఇంటి బాత్రూమ్‌పై కరెంట్ తీగపడింది. ఇది గమనించకుండా శివాజీ బాత్రూమ్ డోర్ ముట్టుకోగా కరెంట్ షాక్ వచ్చింది. దీంతో కేకలు వేయడంతో వెళ్లి రక్షించబోయే సరికి మృతి చెందాడని శివాజీ సోదరి తెలిపింది. ఈ సంఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొండపాక, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైను మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం వెలికట్ట శివారులో రాజీవ్ రహదారి నుంచి జప్తినాచారం వెళ్లే రహదారి పై జరిగింది. వివరాల్లోకి వెళితే.. జగదేవపూర్ మండలం దౌల్తాపూర్ గ్రామానికి చెందిన అన్నమైన బాబు(23) అనే వ్యక్తి సీతంపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ నరసింహారెడ్డి దగ్గర లేబర్‌గా పని చేసేవాడు. ఆదివారం గాలి దుమారానికి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కొత్త స్తంభాలు పాతి మధ్యాహ్నం విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి వెళ్ళిపోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి

● ఇద్దరికి తీవ్రగాయాలు

చేగుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ముగ్గురిపైకి కారు దూసుకెళ్లడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి చేగుంట మండలం పరిధిలోని వల్లభాపూర్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారి పై జరిగింది. నార్సింగ్ ఎస్సై అహ్మద్ మొయినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్ మండలం వల్లభహపూర్ గ్రామానికి చెందిన పోచమ్మల మారెవ్వ (50) అక్కడికక్కడే మృతి చెందారు. రామయ్య, రుక్మాపూర్ గ్రామానికి చెందిన దశరథంకు తీవ్రమైన గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుదాఘాతంతో మేకలు మృతి

● సుమారు రూ.70 వేల వరకు నష్టం

తొగుట, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మూడు మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన మంగళవారం లింగంపేట పటేల్ చెరువు సమీపంలో జరిగింది. బాధితుడు కథనం ప్రకారం... తొగుట గ్రామానికి చెందిన ముచర్ల రమేష్ మంగళవారం మేకలను తోలుకొని లింగంపేట గ్రామ శివారులోని పర్యలిచెరువు ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ స్తంభం నేల వాలింది. అది చూడకుండా మేకల కాపరి అటు వైపు వెళ్లడంతో విద్యుదాఘాతానికి మూడు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.70 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ ప్రమాదం చోటుచేసుకుందని గ్రామస్థులు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన గొర్ల శ్రీనివాస్ (40) అనే వ్యక్తి మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.7వేలు, 7మొబైల్‌ఫోన్లు స్వాధీనం

జహీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): హోతి(కే) శివారులోగల ఇటుకబట్టీల సమీపంలో పేకాటస్థావరంపై దాడులు చేసి రూ. 7,140లు, 7మొబైల్‌ఫోన్లు, పేకాట కార్డులు స్వాధీనం చేసుకోవడమైందని ట్రైనీ ఎస్సై సుజిత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం హోతి(కే) శివారులో పేకాట ఆడుతున్నట్లు తెలిసిందన్నారు. దీంతో పేకాటస్థావరంపై దాడులుచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

మైలాన్‌లో అగ్ని ప్రమాదం



మైలాన్‌లో మంటలు వస్తున్న దృశ్యం

ఐడీఏబొల్లారం మే 6 (ఆంధ్రజ్యోతి): ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడ మైలాన్ రసాయన పరిశ్రమలో మంగళవారం తెల్లవారుజామున ఆర్‌అండ్‌డీ విభాగంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించి ఉంటాయని పరిశ్రమ ప్రతినిధులు చెప్పారు. ఎటువంటి ఫిర్యాదు రానందున కేసు నమోదు కాలేదని సీఐ రవీందర్‌రెడ్డి చెప్పారు.

'ఆదివాసులపై దాడులు, హత్యాకాండను ఆపండి'

చేగుంట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై దాడులు వెంటనే ఆపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డప్పు శివరాజ్‌మాదిగ డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● మెదక్ జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య



పెద్దశంకరంపేట : రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

రేగోడు/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట, మే6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తామని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. మంగళవారం రేగోడు, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట మండల పరిషత్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల విధివిధానాలను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవోలు చంద్రశేఖర్, విఠల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధి యాదయ్య, మండల పరిషత్ సూపరింటెండెంట్లు రమేష్, షాకీర్‌అలీ, సీనియర్ అసిస్టెంట్లు రవీందర్, కాశీరాం, జూనియర్ అసిస్టెంట్లు కేశయ్య, సజ్జద్ అలీ, సిబ్బంది తదితరులు ఉన్నారు. కాగా రేగోడులో జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీలో ఎంపీడీవో అందుబాటులో లేరు.

● మునిపల్లి, మే6 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని సంగారెడ్డి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు, కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగం, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఐపీఎల్ బెట్టింగ్.. నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ ఎల్ శ్రీను

చేర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలో ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేశారు. చేర్యాల సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎల్ శ్రీను వివరాలను వెల్లడించారు. అక్కన్నపేట మండలం రామారం గ్రామానికి చెందిన కూరపాటి శివప్రసాద్, చేర్యాల పట్టణానికి చెందిన ముగ్గురి మైనర్లతోపాటు మరికొంతమంది కలిసి పట్టణ శివారులోని చెరువు సమీపంలో ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్న సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు చేశారు. కొందరు పారిపోగా, పట్టుబడిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వీరివద్ద నుంచి రూ.76,400, నాలుగు మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశారు. ఈ సమావేశంలో ప్రొబేషనరీ ఎస్ఐ సమత, హెడ్‌కానిస్టేబుల్ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

రెట్టింపు డబ్బులంటూ మోసం

● రూ.1.74లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

దుబ్బాక, మే6(ఆంధ్రజ్యోతి): రెట్టింపు డబ్బులు ఇస్తామంటూ ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి డబ్బులు కాజేసిన సంఘటన దుబ్బాక పట్టణంలో వెలుగు చూసింది. మంగళవారం దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక పట్టణానికి చెందిన వ్యాపారి మహ్మద్ సలాం ఫోన్‌కు అమిలీయా పేరుతో యాప్ లింక్ వచ్చింది. దానిపై క్లిక్ తెరిచి చూసిన అతడితో మీరు ఎన్ని డబ్బులు పంపిస్తే అంతకు రెట్టింపు డబ్బులు తిరిగి వస్తాయని సైబర్ నేరగాళ్లు నమ్మబలికారు. దీని నమ్మిన అతడు మొదట రూ.30 వేలు పంపగా, రూ.60 వేలు వచ్చాయి. అనంతరం రూ.60వేలు పంపంగా రూ.లక్షా 20వేలు వచ్చాయి. దీంతో మరింత డబ్బు సంపాదించాలనే ఆశతో అప్పటి వరకు వచ్చిన డబ్బులతోపాటు మరో రూ.1,74,999 అదనంగా పంపించాడు. ఈసారి తిరిగి డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన అతడు 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. దుబ్బాక పోలీసులు విచారణ చేపట్టి ఆ సైబర్ నేరగాళ్ల నుంచి సుమారు రూ.7వేలు రికవరీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు.

ఎక్కడి పనులు అక్కడే

● నిధులు రాక నిలిచిన అభివృద్ధి

● జిల్లా మంత్రులకు విన్నవించినా ఫలితం శూన్యం



నిలిచిపోయిన సమీకృత మార్కెట్ భవన పనులు



అసంపూర్తిగా నిలిచిన ఆధునిక దోభీ ఘాట్ భవనం

నర్సాపూర్, మే 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో నిధులు రాక పలు లభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న నర్సాపూర్ పట్టణం ప్రగతి దిశగా పరుగులు పెట్టాల్సి ఉండగా.. ప్రగతి పనులు ఎక్కడికక్కడే పడకేశాయి. గతంలో మంజూరైన కోట్ల రూపాయలు కూడా విడుదల కాకపోవడంతో పలు భవనాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇక్కడ బీఆర్ఎస్‌కు చెందిన సునీతారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అందుకే ఈ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆగిపోయిన అభివృద్ధి పనులు పూర్తిచేయాలని జిల్లా మంత్రి దామోదర్‌రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖలకు విన్నవించినా ఫలితం లేదని వారు విమర్శిస్తున్నారు.

అసంపూర్తి దశలోనే సమీకృత మార్కెట్

నర్సాపూర్ పట్టణంలో కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు అన్ని ఒకే చోట ప్రజలకు సౌకర్యవంతంగా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో రూ.ఈ కోట్లతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ అసంపూర్తి దశలోనే వదిలేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులను ప్రస్తుత కాంగ్రెస్ నిలుపడంతోపాటు చేసిన పనులు బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి.

మున్సిపల్ భవనం..

నర్సాపూర్ మున్సిపల్ నూతన భవనం రూ.5కోట్లతో నిర్మిస్తున్నారు. నిధులు రాక తుది దశలో పనులు ఆగిపోయాయి. చేసిన పనులకూ బిల్లులు రావడం లేదని సదురు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీంతో ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం అర కొర సౌకర్యాలతో మహిళ మండలి భవనంలో ఇరుకు గదుల మధ్య సాగుతుంది. ఇక ఆధునిక దోభీఘాట్ పనులు రెండుకోట్లతో దాదాపు చివరిదశలో ఉండి నిధులు రాక నిలిచిపోయాయి. అదేవిధంగా కోటి నిధులతో చేపట్టిన గౌడ సామాజిక భవనం, సునీతారెడ్డి కాలనీలో మహిళమండలి తదితర భవనాలన్నీ నిధులు విడుదల కాకపోవడంతో మధ్యలో నిలిచిపోయాయి.

మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు..



నర్సాపూర్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపుతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి, ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నందున్నే ఈ నియోజకవర్గంపై చిన్నచూపు చూస్తున్నారు. నిధుల కోసం ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు ఒత్తిడి తెస్తూ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు ప్రయత్నం చేస్తా.

-సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

సొంత భవనాలు కరువు

డివిజన్ కేంద్రంగా ఉన్న నర్సాపూర్‌లో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కూడా లేవు. అందరికి భూములు చూపే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకూ సొంత భవనాలు లేకపోవడం గమనార్హం. ఆర్డీవో కార్యాలయం పశుసంవర్ధక శాఖకు చెందిన భవనంలో, తహసీల్దార్ కార్యాలయం నీటిపారుదల శాఖ అతిథిగృహంలో కొనసాగుతున్నాయి. ఇక ఎక్సైజ్ కార్యాలయం కూడా అతిథి గృహంలో, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అలాగే పలు విద్యాలయాలు, వసతిగృహాలను సైతం సొంత భవనాలు లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.

గ్రామాల్లోనే భూ సమస్యల దరఖాస్తుల స్వీకరణ

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



బండా పోతుగల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

చిలప్‌చెడ్, మే 6(ఆంధ్రజ్యోతి): గతంలో భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేదని, నేడు భూ భారతి కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ అధికారులే గ్రామాల్లోకి వచ్చి భూ సమస్యలు దరఖాస్తులను స్వీకరిస్తారని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం బండాపోతుగల్ గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సహదేవ్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే అన్ని మండలాల్లో భూ భారతి చట్టంపై అవగాహన కల్పించామన్నారు. జూన్ మొదటి వారంలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులను నిర్వహిస్తామన్నారు. అనంతరం మండలం లోని చిట్కుల్ గ్రామాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే, తాగునీటి ఎద్దడిని పరిశీలించారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

మనోహరాబాద్ మే 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలం దండుపల్లిలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. వివరాలను ప్యాక్స్ చెర్మన్ బాలకృష్ణ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో జయచంద్రరెడ్డి, డీఆర్‌వో ఇన్‌చార్జి రమేష్, వెంకటేష్, బాలగౌడ్ రైతులు పాల్గొన్నారు.

జవాబుదారీతనం పెరగాలి

● సీనియర్ సంపాదకులు, కవి, రచయిత కె. శ్రీనివాస్

● మీడియా అంటే తెలియనివారిని జర్నలిస్టులుగా గుర్తించవద్దు

● టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీ పిలుపు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కె. శ్రీనివాస్

ములుగు, మే 6 (ఆంధ్రజ్యోతి): మీడియాలో భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు జవాబుదారీతనం పెరగాలని సీనియర్ సంపాదకులు, కవి, రచయిత కె శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో గజ్వేల్ ప్రెస్ క్లబ్ 25ఏళ్ల వేడుకల సందర్భంగా జర్నలిజం గతం-వర్తమాన-భవిష్యత్తు అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రధాన, సోషల్ మీడియాల్లో జవాబుదారీతనం లేకపోవడంతో విచ్చలవిడితనం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సోషల్, డిజిటల్ మీడియా దారి తప్పకుండా ఉండాలంటే ప్రధాన మీడియా వాటికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. గతంలో ప్రింట్ జర్నలిజంలో వడపోత ప్రక్రియ ఉండేదని, రాజకీయ పార్టీలు విచక్షణ రహిత జర్నలిజాన్ని ప్రోత్సహించవద్దని కోరారు. సామాజిక స్పృహతో జనం పక్షాన నిలబడి పనిచేస్తున్న గజ్వేల్ ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులను ఆయన అభినందించారు. జర్నలిజం పేరుతో కొన్ని అల్లరి మూకలు చేస్తున్న ఆగడాల కట్టడికి ప్రజలు, రాజకీయ నాయకులు కంకణబద్ధులు కావాలని టియుడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీ పిలుపునిచ్చారు. మీడియా అంటే తెలియనివారిని జర్నలిస్టులుగా గుర్తించవద్దన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కృపాకర్ రెడ్డి, ఎల్లం, తాడెం నర్సింహులు, జగదీశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ జహంగీర్, నాయకులు దేవేందర్‌రెడ్డి, రమేష్ రెడ్డి, కొట్టాల గణేష్, కొన్యాల బాల్‌రెడ్డి, ఎంపీడీవో స్వర్ణకుమారి, తహసీల్దార్ ఆరిఫా, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, జర్నలిస్టులు సురేందర్, ఎల్లారెడ్డి, యాదగిరి, మధుసూదన్ రెడ్డి, కిరణ్, కడపల్ల నరసింహారెడ్డి, కడపల్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్ఐపై దాడి

మద్దూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాటుసారాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసేందుకు సిబ్బందితో కలిసి వెళ్లిన ఎక్సైజ్ ఎస్సైపై మూడావత్ సంతోశ్ దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం ధూళిమిట్ట మండలం కొండాపూర్ పరిధిలోని చెలిమెతండాలో చోటుచేసుకుంది. మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెలిమతండాలో నాటుసారాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ఐ గుగులోతు సువర్ణ తమసిబ్బందితో కలిసి తండాకు వెళ్లారు. అక్కడ పీర్యా ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తుండగా, పక్క ఇంట్లో ఉన్న మూడావత్ సంతోశ్ వారివద్దకు వచ్చి దుర్భాషలాడి గ్రానైట్ రాయి విసిరివేయడంతో ఎస్ఐ సువర్ణ ఎడమ మోచేతికి గాయమైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహబూబ్ అలీ తెలిపారు.

రావి ఆకుపై అమ్మవారు



నారాయణఖేడ్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని హిందువులకు మరీ ముఖ్యంగా ఆర్యవైశ్యులకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అంటే ఎంతటి భక్తో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. వారి కుల దైవమైన ఈ తల్లిని తలచుకోనిదే వారి జీవితం గడవదు. నేడు వాసవి మాత జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ రావి ఆకుపై అమ్మవారి చిత్రం, ఒక చేతిలో కమలం, మరో చేతిలో చిలుక చిత్రాలతో ప్రతి ఒక్కరికి కన్యకాపరమేశ్వరి మాత జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

సీఐటీయూని గెలిపించండి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

గజ్వేల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాణే బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా మంగళవారం పరిశ్రమ గేటు ఎదుట యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ కార్మిక పక్షపాతి అని, కార్మికుల మెరుగైన జీవన ప్రమాణాల కోసం యజమాన్యలతో రాజీ లేని పోరాటాలు చేస్తుందన్నారు. గతంలో 10వేలకు పైగా వేతన ఒప్పందం చేసి కార్మికుల కుటుంబాలకు మెరుగైన మెడికల్ పాలసీని, జీపీఏను అమలు చేసి, కార్మికులకు ఎటువంటి నష్టం రాకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేపిస్తూ కాపాడుకున్నదన్నారు. వివిధ రూపాల్లో కార్మికులు మరణించినప్పుడు వారి కుటుంబాలకు అండగా ఉండే విధంగా పథకాలు తయారుచేసి ఆదుకున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ దువ్వల భిక్షపతి, యూనియన్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, మల్లయ్య, నర్సింహులు, రంగారెడ్డి, వి. వెంకట్రావు, ఏ. స్వామి, శ్రీనివాస్, సాజిద్, కృష్ణమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

● సద్వినియోగం చేసుకోవాలంటున్న పోస్టల్ అధికారులు



సిద్దిపేట కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ ఆప్‌డేట్, పేరులో మార్పులు, ఫొటో ఐడెంటిటీ కోసం ఆధార్ సెంటర్ల వద్ద జనాలు భారీ క్యూలు కడుతున్నారు. కాగా, సిద్దిపేట జిల్లాకేంద్రంలోని పోస్టాఫీసులో కూడా ఆధార్ సేవలు అందిస్తున్నారు. ఇది చాలామందికి తెలియకపోవటంతో ఆ సేవలను సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో పోస్టాఫీస్‌లో అధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ ఎస్పీ శ్రీహరి, ఏఎస్పీ నికేశ్ కుమార్, సిద్దిపేట హెడ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్ ప్రజలకు సూచిస్తున్నారు. సిద్దిపేట హెడ్ పోస్టాఫీస్‌లో ఏర్పాటు చేసిన అధార్ సెంటర్‌లో కొత్తగా అధార్ కార్డు, మార్పులు, చేర్పులు, ఫొటో ఐడెంటిటీ, బయోమెట్రిక్ ఆప్‌డేట్ సేవలను పొందవచ్చని తెలిపారు. ఆధార్ నమోదు కోసం, మార్పుల కోసం వచ్చే వారికోసం పలు సూచనలు చేశారు.

ఆధార్ మార్పులకు కావాల్సిన పత్రాలివే..

● కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవాల్సిన వారు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్ అవసరమని, ఆ సర్టిఫికెట్‌లో క్యూఆర్ కోడ్ స్పష్టంగా ఉండాలి. తండ్రి ఆధార్ కార్డులో ఉన్న అడ్రస్ బర్త్ సర్టిఫికెట్‌లో ఉండాలి. అలాగే తండ్రి ఆధార్‌లో కూడా కొత్తగా ఏర్పడ్డ జిల్లాలు, రాష్ట్రం అప్‌డేట్ అయి ఉండాలి. అంటే ఆంధ్రప్రదేశ్ స్థానంలో తెలంగాణ అని ఉండాలని, లేకపోతే ముందుగా వారు అప్డేట్ చేసుకోవాలి

● పిల్లలకు పేరు, అడ్రస్ మార్పు కోసం స్కూల్ బోనాఫైడ్ సర్టిఫికెట్ ప్రకారం కావలనుకుంటే సంబంధిత మండలంలో నివాస సర్టిఫికెట్ తీసుకుని మీకు కావాల్సిన పేరు విధంగా తీసుకవచ్చి పేరు, అడ్రస్ మార్చుకోవచ్చు.

● డేట్ ఆఫ్ బర్త్ మార్పు కోసం బర్త్ సర్టిఫికేట్, ఎస్ఎస్‌సీ ఒరిజినల్ మెమో (18 ఏళ్ల పైబడిన వారికి) పెద్ద వాళ్లకు అయితే పాస్‌పోర్టు ఐడెంటిటీ ద్వారా కూడా మార్చుకోవచ్చు.

● వివాహం తర్వాత పేరు, అడ్రస్ మార్చుకోవాలనుకుంటే మ్యారెజ్ సర్టిఫికెట్ లేదా మండలంలో రెసిడెన్షియల్ సర్టిఫికెట్ ద్వారా మార్చుకోవచ్చు.

● పేరు మార్పు కోసం పాన్ కార్డు, ఓటర్ ఐడి, లేటెస్ట్ బ్యాంకు పాస్ బుక్, ఎస్ఎస్‌సీ మెమో, పాస్‌పోర్టు ద్వారా కూడా మార్చుకోచ్చు.

● ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్‌కు బదులుగా తెలంగాణ అని మార్చుకోవాలంటే లేటెస్ట్ రెసిడెన్షియల్ సర్టిఫికేట్, బ్యాంకు పాస్‌బుక్ ద్వారా అప్డేట్ చేసుకోవచ్చు. ఇలాంటివి మార్పుల కోసం పోస్టాఫీసులో సేవలను పొందాలి వారు సూచించారు. రైల్వే సేవలను కూడా ఇక్కడ పొందవచ్చన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం



హత్నూర : దౌల్తాబాద్‌లో రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

హత్నూర, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి దౌల్తాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

● కొండాపూర్,మే6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేపల్లి లక్ష్మీనారాయణ అష్టమ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా జరిపించారు. వైకుంఠపురం ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యుల పర్యవేక్షణలో వేదపండితులు జరిపించారు. యజ్ఞం, యాగాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారుల భరతనాట్యం ఆకట్టుకున్నది. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, తనయుడు సాయికుమార్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

● రేగోడు మే6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన రేగోడు పోతులూరి వీర బ్రహ్మంగారి మఠంలో ఆరాధన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం బ్రహ్మంగారి, శరబాక లింగమయ్య మఠం వద్ద పలహార బండ్ల ప్రదర్శన వైభవంగా జరిగింది. ప్రతేక హోమాలు నిర్వహించారు. బ్రహ్మంగారి, దుర్గమ్మ దేవి వీధి నాటకాలు నిర్వహించారు.



రేగోడు బ్రహ్మంగారిమఠం వద్ద బండ్ల ప్రదర్శన



కొండాపూర్ : లక్ష్మీనారాయణుడి కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

11 నుంచి భూలక్ష్మమ్మ జాతర



నారాయణఖేడ్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఒడెనక బండి కట్టి భూలక్ష్మమ్మ జాతరకు పదండి అంటూ పాటలు పాడి పరవశించే తుర్కపల్లి భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలు ఈ నెల 11 ఆదివారం నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 11న ఉదయం మహాలక్ష్మీదేవిపూజ, నైవేద్యాల సమర్పణ, సాయంత్రం 4 గంటలకు బండ్ల ఊరేగింపు, రాత్రి బోనాల ఊరేగింపు, భజనలు, కీర్తనలు ఉంటాయి. సోమవారం పాచిబండ్ల ప్రదర్శన, ఊరేగింపు, కుస్తీపోటీలు నిర్వహించనున్నారు. కామారెడ్డి జిల్లా ధర్మారంకు చెందిన బండ్లు కూడా ఈ జాతర ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. తుర్కపల్లిలో దాదాపు 500 సంవత్సరాల క్రితం స్వయంభువుగా అమ్మవారు వెలిసినట్లు పూర్వీకుల ద్వారా తెలుస్తుంది. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి 'పల్లా' సాయం

చేర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా కిడ్నీసంబంధిత వ్యాధితో బాధపడుతున్న చేర్యాల మండలం వేచరేణి శివారు ఎల్లదాస్‌నగర్ కాలనీకి చెందిన నూనె తిరుపతి మంగళవారం మృతి చెందాడు. తిరుపతి మృతి పట్ల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సంతాపం వ్యక్తంచేస్తూ రూ.5వేలు ఆర్థికసహాయం అందించారు. ఎమ్మెల్యే తరుపున మాజీ సర్పంచు పర్పాటకం దుర్గారెడ్డి, దుర్గయ్య తదితరులు నగదును మృతుడి కుటుంబసభ్యులకు నగదును అప్పగించారు.

బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షురాలిగా స్వరూప


బూర్గోజు స్వరూప

చేర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షురాలిగా మండలంలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన బూర్గోజు స్వరూప నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ నియామకపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమఫలాలను ప్రజలకు వివరించి పార్టీ సంస్థాగత బలోపేతానికి చిత్తశుద్ధితో పాటుపడతానన్నారు.

చేర్యాల పట్టణ అధ్యక్షుడిగా కర్క తిరుపతిరెడ్డి



బీజేపీ చేర్యాల పట్టణాధ్యక్షుడిగా కర్క తిరుపతిరెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ నియామకపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత బలోపేతానికి చిత్తశుద్ధితో పాటుపడతానన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టినందుకు పార్టీనేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

దుబ్బాక మండల అధ్యక్షుడిగా అనిల్‌రెడ్డి

● దుబ్బాక: బీజేపీ దుబ్బాక మండల అధ్యక్షుడిగా అచ్చుమాయిపల్లి గ్రామానికి చెందిన మంద అనిల్‌రెడ్డిని మంగళవారం ఏకగ్రీవంగా నియమించారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అనిల్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యుడు బాలేష్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పూజలు

గజ్వేల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరిపై శ్రీ రేణుకా మాత అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు ఉండాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆకాంక్షించారు. సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా గౌడసంఘం ఆహ్వానం మేరకు ఆయన విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు.

వరదరాజ స్వామి ఆలయానికి ఎర్రవల్లి మాదిగల విరాళం

మర్కుక్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన మాదిగ మహారాజుల సంఘం నల్లవాడకట్టు తరపున వరదరాజపూర్‌లో గల భూనీల సమేత వరదరాజ స్వామి పునర్నిర్మాణంలో భాగస్వాములు కావడానికి తమ వంతుగా రూ. 21 వేలను ట్రస్ట్ చైర్మన్ గోపాలకృష్ణకు విరాళాన్ని అందించారు.

రైతు వ్యతిరేక విధానాలను వీడాలి

● బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేకవిధానాలను వీడి, ఆకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్‌రాజు, బీఆర్‌ఎస్ మండల పార్టీఅధ్యక్షుడు అంజిరెడ్డిలు పేర్కొన్నారు. ఆకాలవర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం మిరుదొడ్డి తహసీల్దార్ ఉదయశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఎకరాకు రూ.35వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బాల్‌రాజు, నాయకులు లింగం, సత్యనారాయణ, భైరయ్య, నర్సింహ్మారెడ్డి, రాములు, మల్లేశం, కుమార్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదు

మిరుదొడ్డి, మే 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వహయాంలో వడగండ్ల వర్షాలు కురిస్తే అప్పటి మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఆగమేఘాలమీద పర్యటించినా ఇప్పటివరకు ఆ నష్టపరిహారం బాధితులకు అందలేదని మిరుదొడ్డి మాజీ ఎంపీపీ గజ్జల సాయిలు విమర్శించారు. ఇప్పుడు బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు కాంగ్రెస్‌ప్రభుత్వంపై ఇష్టమచ్చినట్లు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంగళవారం మిరుదొడ్డిలో కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఆకాల వర్షానికి నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు భూమాగౌడ్, భూపాల్‌గౌడ్, కిష్టయ్య, నర్సింహ్మారెడ్డి, రాజు, కుమార్, రామకృష్ణ, కిష్టాగౌడ్ తదితరులున్నారు.

చేర్యాల చేపల మార్కెట్‌ను పట్టించుకోరా?

● వారాంతపు సంతలో రోడ్డుపైనే విక్రయాలు
● గతంలో పెద్దచెరువుకట్ట అవరణలో రూ.10లక్షలతో షెడ్డు నిర్మాణం
● మౌలికవసతులను కల్పించకపోవడంతో నిరుపయోగం
● చేపల కోసం చేర్యాల నుంచి సిద్దిపేట లేదా జనగామకు వెళ్లాల్సిన దుస్థితి



వారాంతపు సంతలో రోడ్డుపక్కనే చేపలు విక్రయిస్తున్న సంచార వ్యాపారులు, నిర్వహణ లేక అధ్వానంగా షెడ్డు

చేర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో చేపల మార్కెట్ భవనం కలగానే మారింది. మాంసం ధరలు పెరిగిపోతుండటంతో ప్రత్యామ్నాయంగా బలవర్థక పోషకాహాలున్న చేపలపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో చేపలకు నానాటికి డిమాండ్ పెరిగిపోతున్నది. అందుకు అనుగుణంగా చేపల మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ఉసూరుమంటున్నారు.

షెడ్డు సరే.. వసతులేవీ?

చాన్నాళ్లక్రితమే స్థానిక పెద్ద చెరువుకట్ట సమీపంలో చేపల విక్రయం చేపట్టాలని నిర్ణయించి సుమారు రూ.10లక్షల వ్యయంతో షెడ్డు నిర్మించారు. కానీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల పట్టింపులేని ధోరణితో అది నిరుపయోగంగా మారింది. దీంతో చేపలకోసం ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనవుతూ సిద్దిపేట, జనగామ మార్కెట్‌లకు వెళ్లాల్సివస్తున్నది. పట్టణంలో నిత్యం విక్రయాలు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ షెడ్డులో మౌలికవసతుల కల్పన చేపట్టకపోవడంతో షెడ్డు కాస్తా నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. కేవలం ప్రతీ మంగళవారం పట్టణంలో జరిగే వారాంతపుసంతలో ఒకరిద్దరు వ్యాపారులు స్థానిక గాయత్రీ స్కూల్ మూలమలుపు వద్ద రోడ్డుపక్కన విక్రయాలు సాగిస్తుండటంతో అక్కడ జోరుగా అమ్మకాలు సాగుతున్నాయి. కానీ రోడ్డుపక్కనే దుమ్ము, ధూళి మధ్యన అపరిశుభ్ర పరిస్థితులు నెలకొనడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు పరిసరాల్లో దుర్వాసన

చేర్యాలలో ఉన్న ఒకరిద్దరు చేపల వ్యాపారులు వ్యర్థాలను వారి వెంటే తీసుకొని వెళుతున్నప్పటికీ పరిసరాలు దుర్వాసన వెదజల్లి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మునిసిపాలిటీగా మారి ఎంతో కాలమైనప్పటికీ చేపల మార్కెట్ ఏర్పాటుపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షణ కరువై సదరు షెడ్డు ఆవరణ అధ్వానంగా మారింది. ఈవిషయమై మునిసిపల్ అధికారులు చొరవవహించి ప్రత్యామ్నాయ వసతుల కల్పన పూర్తిచేసి చేపల మార్కెట్ భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిరుజల్లుకే కుంటలా ముంద్రాయి రోడ్డు


ముంద్రాయి వద్ద చిన్న వర్షానికే కుంటలా తయారైన రోడ్డు

నంగునూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట- హనుమకొండ రోడ్డు విస్తరణలో భాగంగా ఇష్టారీతిన పనులు చేపట్టడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణలో ముంద్రాయి గ్రామంలో చిన్నపాటి వర్షానికి రోడ్డుపై మీరు చేరి కుంటలా మారింది. గ్రామంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రోడ్డు పనులు మధ్యలో వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షానికి నడవలేని దుస్థితి ఏర్పడుతుంది.వెంకటాపూర్, నర్మేట వెళ్లే దారిలో హనుమకొండ సిద్దిపేట రహదారిపై మాత్రమే పనులు చేసి రోడ్డు ఎత్తు పెంచడంతో అక్కడ పెద్ద గుంతగా మారింది. ఇష్టానుసారంగా పనులు చేయడం వల్లే ఇక్కడ నీరు నిలిచిపోతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కేవలం ప్రధాన రోడ్డు మీదే పనులు చేసి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే దారిని పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు ఎత్తు, వంపు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డు విస్తరణ పనులను సక్రమంగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. పచ్చదనానికి శాపం


మద్దూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చెట్లను నరికివేసిన విద్యుత్‌సిబ్బంది

మద్దూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం హరితహారం చెట్ల పాలిట శాపంగా మారింది. విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్నాయని తొలగించడంతో ప్రభుత్వ ఆశయం అభాసుపాలవుతోంది. మద్దూరు మండలకేంద్రంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా అధికారులు ఉపాధిహామీలో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటించారు. అందులో చాలా చెట్లు ఏపుగా పెరిగి అనేక చోట్ల విద్యుత్ తీగలకు తగులుతుండటంతో తరచూ విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సోమవారం రాత్రి పెద్దఎత్తున ఈదురుగాలులకు విద్యుత్ తీగలకు చెట్టు తాకుతుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో మంగళవారం ఉదయం విద్యుత్ సిబ్బంది అంతరాయం కల్గిస్తున్న చెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

సరైన ప్రణాళిక లేకుండా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటించడమేంటని హరిత ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు.

చేర్యాల మండలంలో గాలి వాన బీభత్సం



గుర్జకుంట శివారులో నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్, చేర్యాలలో కూలిన భారీ వృక్షం

చేర్యాల,, మే 6 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. చేర్యాల మండలం గుర్జకుంట గ్రామశివారులోని ఓ భారీ వృక్షం నేలకూలింది. అలాగే వ్యవసాయపొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన విద్యుత్‌స్తంభం నేల కూలింది. పలు గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్టుకొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం నిలిచిన అనంతరం సిబ్బంది శ్రమించి సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఖజానాపై భారం పడినా.. సంక్షేమ పథకాలకు పెద్దపీట


గజ్వేల్ తహసీల్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, మే 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ సమీకృత భవనంలోని తహసీల్దారు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఖజానాపై భారం పడుతున్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసి అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి చొరవతో గజ్వేల్ నియోజకవర్గంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న 800కు పైగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను యుద్ధ ప్రాతిపదికన లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, నాయకులు సుఖేందర్‌రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్నగారి రాజు, రాములుగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

గజ్వేల్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి):పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని మాజీ ఎంపీటీసీ తుప్పతి అంజియాదవ్ అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన ఆరుగురికి కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను మాజీ ఎంపీటీసీ తుప్పతి అంజియాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రీ లాగిన్‌లో షిఫ్టింగ్

● రైతులకు తప్పని పడిగాపులు


మండలం షిఫ్టింగ్‌తో రైతు వేదికలో ఖాళీగా కూర్చున్న ఏఈవోలు

మద్దూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని మద్దూరు మండలం, నారాయణ్‌పేట్ జిల్లాలోని మద్దూరు మండలం ఒకటే పేరు కావడంతో ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకునేందుకు వచ్చిన రైతులకు మంగళవారం చుక్కెదురైంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించిన వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు మంగళవారం కార్యాలయానికి వచ్చారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డుకు లింకు చేయబడిన మొబైల్ నెంబరు అందించగా నారాయణ్‌పేట్ జిల్లా మద్దూరు మండలం చూపించడంతో ఏఈవోలు కంగుతిన్నారు. రెండు జిల్లాల్లో ఉన్న మండలాల పేర్లు సైతం ఒకటే కావడంతో లాగిన్ షిఫ్టింగ్ జరిగిందని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులకు సమాచారం అందించినట్లు ఏఈవోలు తెలిపారు. రెండు రోజుల్లో సాంకేతిక సమస్యను సరిచేయనున్నట్లు రైతులకు సర్ది చెప్పి దరఖాస్తులు స్వీకరించకుండానే వెనక్కి పంపించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


బెజ్జంకి మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ

బెజ్జంకి, మే 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు కురుస్తునందున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని డీఆర్‌ఏ పీడీ జయదేవ్ ఆర్య సూచించారు. మంగళవారం బెజ్జంకి మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఏపీఎం నర్సయ్య, సీసీ సారయ్య, సెంటర్ నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దు

మిరుదొడ్డి, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని డీపీఎం రాజయ్య పేర్కొన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలం అందె, అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్, అక్బర్‌పేట గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

అమలు చేయలేని హామీలు ఎందుకిచ్చారు?

● బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు

గజ్వేల్, మే 6 (ఆంధ్రజ్యోతి): హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ... రేవంత్‌రెడ్డి అన్ని విషయాల్లో విఫలమయ్యారన్నారు. పరిపాలన చేతకాక అసమర్థ పాలనతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు విడ్డూరంగా ఉందన్నారు. అమలు చేయలేనప్పుడు ఎందుకు హామీలు ఇచ్చారని ప్రశ్నించారు. పాలన చేతకానప్పుడు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన సీఎంకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

నేటి నుంచి నర్మెటలో బ్రహ్మోత్సవాలు


సీతారామచంద్రస్వామి మూలవిరాట్

నంగునూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 నుండి అంగ రంగ వైభవంగా జరగనున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ రాళ్ల బండి రమణాచారి తెలిపారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. ఉత్సవాలు 7న గణపతి పూజతో ప్రారంభమై 12వ తేదీన రథోత్సవం, చక్రస్నానంతో ముగుస్తాయని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 26 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.45,500 జరిమానా విధించారు.

టీడీపీకి పూర్వ వైభవం తీసుకొద్దాం


మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు దామెర సత్యం

హుస్నాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ పరిశీలకుడు దామెర సత్యం పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన టీడీపీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అనంతరం నియోజకవర్గంలోని మండలాల కమిటీలను నియమించారు. హుస్నాబాద్ మండల అధ్యక్షులు, కార్యదర్శులుగా బత్తుల శంకర్, ఆకుల వెంకటస్వామి, హుస్నాబాద్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా అప్పె అంజనేయులు శర్మ, మహ్మద్ హసన్, కోహెడ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బొల్లి శంకర్, శ్రీమంతుల శ్రీనివాస్, సైదాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రావుల తిరుపతిరెడ్డి, కొండ శ్రీనివాస్, అక్కన్నపేట మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కొమ్ముల సుభాష్, కేశినేని సంజీవ్, భీమదేవరపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎగులపురం శ్రీనివాస్, పంజాల శ్రీధర్, చిగురుమామిడి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మహమ్మద్ షారుఖ్, వరికోలు రవీందర్, ఎల్కతుర్తి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్ నసుర్, సుపాక రాజులను నియమించారు.

అక్రమంగా వలస వచ్చినవారిని వెనక్కి పంపాలి


చేర్యాల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చేర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తిష్ట వేసిన పాక్, బంగ్లాదేశానికి చెందిన అక్రమవలసదారులను గుర్తించి వెనక్కి పంపించివేయాలని కోరుతూ చేర్యాలలో బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు మాట్లాడుతూ అక్రమ వలసదారులు తప్పుడు పత్రాలతో నివాసం ఉండటంతో పాటు దేశభద్రతల రక్షణకు ముప్పుకలిగింపచేసేలా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాయకులు బూరుగు సురేశ్, కర్క తిరుపతిరెడ్డి, మన్నె సత్యవర్ధన్, తౌట బాలరాజు, కురార్రం బాలనర్సయ్య, మడికొండ శ్రీనివాస్, లక్ష్మిపతి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం


సిద్దిపేట క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఆ పార్టీ సిద్దిపేట టౌన్ టూ నూతన అధ్యక్షుడు బాసంగారి వెంకట్ తెలిపారు. సిద్దిపేట టౌన్ టూ అధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బైరి శంకర్ వెంకట్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాసంగారి వెంకట్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎంపిక చేసిన పార్టీ ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తుంగ కనకయ్య, ఉమారాణి, లక్కరసు కృష్ణ. కెమ్మసారం సంతోష్, దాబా నరేష్, తాటికొండ శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై అవగాహన


పోతారం(ఎస్)లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

హుస్నాబాద్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం(ఎస్)లో మంగళవారం ఆయిల్ పామ్ తోటల పెంపకంపై ఉద్యాన వ్యవసాయ, ఆయిల్ ఫెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, ఏరియా ఆఫీసర్ శంకర్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో ఆయిల్‌పామ్ తోటలకు సరిపడా నీరు ఇవ్వాలని సూచించారు. అందు కోసం రైతులు ఆయిల్‌పామ్ తోటలపై పూర్తి అవగాహన కల్పించేందుకే క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ అధికారి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. వేసవి కాలంలో మొక్క చుట్టుగాని, మొక్కల మధ్యనగాని లోతు దుక్కులు దున్నకూడదని రైతులకు సూచించారు. ఇంకా పలు అంశాలపై వేసవికాలంలో తోటల పెంపకంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఆయిల్ పామ్ క్షేత్రస్థాయి అధికారి రవళి, రైతులు ఉన్నారు.

భద్రాచల రామయ్య కల్యాణ తలంబ్రాల పంపిణీ


భద్రాద్రి రామయ్య కల్యాణ తలంబ్రాలతో భక్తులు

సిద్దిపేట కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్య కల్యాణంలోని ముత్యాల తలంబ్రాలను సిద్దిపేటలో మంగళవారం పంపిణీ చేశారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో భక్తులకు అందజేశారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు మాట్లాడుతూ.. భద్రాచలంలోని రామయ్య కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర వ్యాప్తంగా 250 కిలోల గోటి తలంబ్రాలు అందించామన్నారు. దీంతో 100 కిలోల సీతారాముల కల్యాణ తలంబ్రాలను తమకు అందజేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో గోటి తలంబ్రాల్లో పాల్గొన్నవారికి రామయ్య కల్యాణ తలంబ్రాలను అందిస్తున్నామన్నారు. కాగా రామయ్య సేవలో పాల్గొనేలా చేసిన రామకోటి రామరాజును భక్తులు ఘనంగా శాలువాతో సన్మానించి సీతారాముల ఫొటో అందజేశారు.

హరితసేనలో అందరూ భాగస్వాములు కావాలి

ములుగు, మే 6 (ఆంధ్ర జ్యోతి): హరితసేనలో అందరూ భాగస్వాములై మొక్కలు నాటాలని సినీ హీరో అనిల్‌మొగిలి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో హరితసేన జిల్లా ఇన్‌చార్జి చెప్యాల రాజేశ్వరరావు, గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి సినీ హీరో అనిల్‌మొగిలి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు రాజేందర్ రెడ్డి, సిహెచ్ సురేష్‌చారి, దార బాలరాజు, ఏనుగు నవపాల్‌రెడ్డి, స్వామిగౌడ్, మహావీర్‌రెడ్డి, వీరాచారి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.